వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక
TGTEL/25/A4812
సంపుటి : 01| సంచిక : 56 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ ఆదివారం | జూన్ 07, 2026



## తాటాకు చప్పుళ్లకు భయపడను..

- రేవంత్‌కు కిషన్‌రెడ్డి ఘాటు కౌంటర్!
- నన్ను పొలిమేర దాటించే మొనగాడు ఇంకా పుట్టలేదు
- రేవంత్ రెడ్డిలా పదే పదే పార్టీలు మారే వ్యక్తిని కాను
- రాసి పెట్టుకోండి.. ఈ జన్మలో రాహుల్ గాంధీ ప్రధాని కాలేరు
- కేంద్రమంత్రి సంచలన వ్యాఖ్య

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌పై కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి అత్యంత ఘాటుగా స్పందించారు. తెలంగాణ రాజకీయాల్లో వేడి పుట్టిస్తున్న ఈ సవాల్ ప్రతిసవాళ్ల పర్వంలో ఆయన సీఎంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తాను రేవంత్ రెడ్డిలా పదే పదే పార్టీలు మారిన వ్యక్తిని కాదని, తన నిజాయితీకి సీఎం ఇచ్చే సర్టిఫికెట్ అస్సలు అవసరం లేదని స్పష్టం చేశారు. "నన్ను పొలిమేర దాటకుండా ఆపే మొనగాడు ఇంకా ఎవరూ పుట్టలేదు. కాంగ్రెస్ నాయకులు ఎంత రెచ్చగొట్టినా నేను రెచ్చిపోను. మీ తాటాకు చప్పుళ్లకు భయపడటానికి ఇక్కడ ఉన్నది కేసీఆర్ కాదు.. బీజేపీ అని గుర్తుంచుకోండి" అంటూ కిషన్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ భవిష్యత్తుపై కిషన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి ఇంకా ఎంతో కాలం లేదని, కేవలం మరో రెండున్నరేళ్లు మాత్రమే ఆయన ఈ పదవిలో ఉంటారని జోస్యం చెప్పారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో త్వరలోనే దళితులు, బీసీలు వచ్చి కాంగ్రెస్ నాయకుల ఇళ్ల ముందు ధర్నాలు చేస్తారని హెచ్చరించారు. అలాగే తన ఇంటి ముందు ధర్నా చేస్తానన్నా తాను దేనికైనా సిద్ధమేనని సవాలు విసిరారు. "ముఖ్యమంత్రి ప్రస్తుతం తీవ్రమైన రాజకీయ నిరాశ, నిస్పృహల్లో ఉన్నారు. అందుకే ఆయన నోటి నుంచి వచ్చే మాటలు కొండలు, కోనలు దాటుతున్నా.. ఆయన ఇచ్చిన హామీలు మాత్రం సెక్రటేరియేట్ గేటు కూడా దాటడం లేదు" అని ఎద్దేవా చేశారు. రైతులకు, ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క గ్యారెంటీని కూడా ఈ ప్రభుత్వం సరిగ్గా అమలు చేయడం లేదని కిషన్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడా ఐదు వందల రూపాయల బోనస్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. కేవలం సన్న వడ్లకే కాకుండా, దొడ్డు వడ్లకు సైతం బోనస్ చెల్లించడంలో కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. ఈ గ్యారెంటీల వైఫల్యాలపై తాను ఏ చర్చకైనా సిద్ధమని ప్రకటిస్తూ.. "రాసి పెట్టుకోండి.. ఈ జన్మలో రాహుల్ గాంధీ దేశానికి ప్రధాని కాలేరు" అంటూ కిషన్ రెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పెను దుమారం రేపుతున్నాయి.

### ఖమ్మం జిల్లాలో
## ప్రైవేట్ బస్సు బోల్తా

- నలుగురికి తీవ్ర గాయాలు
- కొత్తలంకపల్లి రైల్వే వంతెనపై ప్రమాదం
- డివైడర్‌ను ఢీకొట్టిన కేవీఆర్ ట్రావెల్స్ బస్సు
- లగేజీ అద్దాలు పగులగొట్టి ప్రయాణికులను కాపాడిన స్థానికులు



2లో..

**పెనుబల్లి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కొత్తలంకపల్లి రైల్వే వంతెనపై ఆదివారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఏలూరు జిల్లా ముసునూరు మండలం చక్కపల్లి నుంచి హైదరాబాద్ వెళ్తున్న కేవీఆర్ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టి, రోడ్డుపైనే బోల్తా పడింది. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది.

## భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు

- ఒక్కరోజే తులం బంగారంపై రూ.3,000 పతనం..
- రూ.20,000 దిగివచ్చిన కిలో వెండి
- అంతర్జాతీయ మార్కెట్ ఎఫెక్ట్..



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** బంగారం, వెండి ఆభరణాలు కొనుగోలు చేయాలనుకునే వారికి, అలాగే పసిడిపై పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి సరికొత్త శుభవార్త అందింది. గత కొన్ని రోజులుగా అంతర్జాతీయ మార్కెట్లో చోటుచేసుకుంటున్న పరిణామాల కారణంగా దేశీయంగా బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు భారీగా పతనమవుతున్నాయి. గత నెల చివరి వారం నుండి వరుసగా తగ్గుతూ వస్తున్న పసిడి ధరలు, క్రితం సెషన్‌లో ఒక్కరోజె రికార్డు స్థాయిలో కుప్పకూలాయి. అంతర్జాతీయంగా స్పాట్ గోల్డ్, సిల్వర్ ధరలు భారీగా పడిపోవడమే ఇందుకు ప్రధాన కారణమని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో 24 క్యారెట్లు (స్వచ్ఛమైన బంగారం) రూ. 1,52,720 రూ. 3,000 (తగ్గింది), 22 క్యారెట్లు (ఆభరణాల బంగారం)రూ. 1,39,990 భారీగా క్షీణించింది. బంగారంతో పోటీ పడుతూ వెండి ధరలు కూడా మార్కెట్లో భారీగా దిగివచ్చాయి. హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి ధర కేవలం ఒక్కరోజులోనే ఏకంగా రూ.20,000 మేర క్షీణించింది. అంతకుముందు రెండు రోజుల్లో కూడా రోజుకు రూ.5,000 చొప్పున ధరలు తగ్గుతూ రావడం గమనార్హం. పైన పేర్కొన్న బులియన్ మార్కెట్ ధరలు కేవలం ప్రాథమిక రేట్లు మాత్రమే. దీనికి అదనంగా జీఎస్టీ, తయారీ ఖర్చులు, వేస్టేజ్లు వర్తిస్తాయి.

## మృగశిర కార్తె వచ్చేసింది..

- ప్రకృతి ఒడిలో కొత్త ఉత్సాహం..
- నేలతల్లికి తొలకరి పలకరింపు
- రోహిణి ఎండలకు చెక్..
- నేటి నుంచి జూన్ 21 వరకు మృగశిర సంరంభం
- ఇంటింటా ఘుమఘుమలాడనున్న చేపల వంటకాలు..
- శాఖాహారులకు ఇంగువ-బెల్లం ప్రసాదం
- ఏరువాకకు సిద్ధమవుతున్న అన్నదాత..

2లో..



## తమిళనాడులో పొలిటికల్ హీట్



2లో..

- 'టీవీకే' ప్రభుత్వం మూడు నెలలుకూడా ఉండదు..
- స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు
- మా కూటమి మద్దతు వల్లే విజయ్ సీఎం పీఠంపై కూర్చున్నారు
- బీజేపీ పరోక్ష పాలనను అడ్డుకోవడానికే ఈ నిర్ణయం
- ఓటర్లను కలవకపోయినా అదృష్టంతో గెలిచారు
- డీఎంకే అధినేత ఘాటు వ్యాఖ్యలు

## ఖమ్మం జిల్లాలో
# ప్రైవేట్ బస్సు బోల్తా

- నలుగురికి తీవ్ర గాయాలు
- కొత్తలంకపల్లి రైల్వే వంతెనపై ప్రమాదం
- డివైడర్‌ను ఢీకొట్టిన కేవీఆర్ ట్రావెల్స్ బస్సు
- లగేజీ అద్దాలు పగులగొట్టి ప్రయాణికులను కాపాడిన స్థానికులు

**(మొదటి పేజీ తర్వాత..)** ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 36 మంది ప్రయాణికులు ఉన్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లాలోని చక్కపల్లి, ధర్మాజిగూడెం, అక్కిరెడ్డిగూడెం, లింగపాలెం, రాఘవాపురం తదితర ప్రాంతాలకు చెందిన 36 మంది ప్రయాణికులతో బస్సు హైదరాబాద్‌కు బయలుదేరింది. అర్ధరాత్రి సమయంలో కొత్తలంకపల్లి రైల్వే బ్రిడ్జిపైకి రాగానే బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. క్షణాల వ్యవధిలోనే బస్సు బోల్తా పడటంతో ప్రయాణికులు భయాందోళనలతో కేకలు వేశారు. దేవుడిలా ఆదుకున్న గ్రామస్తులు: ప్రమాద శబ్దం విన్న వెంటనే కొత్తలంకపల్లి గ్రామస్తులు భారీ సంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకున్నారు. బస్సు అద్దాలు పగులగొట్టి లోపల చిక్కుకుపోయిన ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. గాయపడిన వారికి అక్కడికక్కడే ప్రథమ చికిత్స అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అత్యవసర సిబ్బంది అంబులెన్స్‌లలో క్షతగాత్రులను సత్తుపల్లి, పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. గాయపడిన వారిలో సత్తుపల్లికి చెందిన ఎం.శిరీష, ఎం.శివగణేశ్, పి.మల్లిక, చక్కపల్లికి చెందిన శ్రీనివాసరావు, పావని, రాఘవాపురానికి చెందిన సుస్మిత, యువన్, విజయరాయికి చెందిన ప్రణీత్, స్వప్న, బి.నరసింహ, లింగపాలెంకు చెందిన తాతిన బాలాజీ, కుంచపర్తికి చెందిన ఆర్.రామకృష్ణ ఉన్నారు. బాధితులందరికీ ప్రాణాపాయం తప్పిందని, ప్రస్తుతం వారు కోలుకుంటున్నారని వైద్యులు తెలిపారు. రైల్వే వంతెనపై బస్సు బోల్తా పడటంతో ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సుమారు అరగంట పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో బస్సును పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

# మృగశిర కార్తె వచ్చేసింది..

- ప్రకృతి ఒడిలో కొత్త ఉత్సాహం..
- నేలతల్లికి తొలకరి పలకరింపు
- రోహిణి ఎండలకు చెక్..
- నేటి నుంచి జూన్ 21 వరకు మృగశిర సంరంభం
- ఇంటింటా ఘుమఘుమలాడనున్న చేపల వంటకాలు..
- శాఖాహారులకు ఇంగువ-బెల్లం ప్రసాదం
- ఏరువాకకు సిద్ధమవుతున్న అన్నదాత..



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రోహిణి కార్తెలో భానుడి ప్రతాపానికి అగ్నిగుండంలా మారిన భూమికి ఉపశమనం లభించనుంది. రోళ్లు సైతం పగిలిపోయేంత ఎండలతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు ముగింపు పలుకుతూ, ప్రకృతికి కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చే 'మృగశిర కార్తె' వచ్చేసింది. ఈ ఏడాది జూన్ 8 నుంచి ప్రారంభమై జూన్ 21 వరకు ఈ కార్తె కొనసాగనుంది. ఆకాశంలో మేఘాలు కమ్ముకోవడం, తొలకరి చినుకులు నేలను తడపడం, రైతుల కళ్లలో ఆశలు చిగురించడం ఈ కాలం ప్రత్యేకత. తెలుగు పంచాంగం ప్రకారం సూర్యుడు మృగశిర నక్షత్రంలోకి ప్రవేశించడంతో ఈ రుతు మార్పు సంభవిస్తుంది.

### అన్నదాతల పండుగ..

మృగశిర కార్తె ప్రారంభమైందంటే చాలు రైతుల ఇళ్లలో పండుగ వాతావరణం కనిపిస్తుంది. రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించి వర్షాలు కురుస్తాయనే ఆశతో పొలాలను సిద్ధం చేసుకోవడం, దుక్కి దున్నడం, విత్తనాలు చల్లడం వంటి వ్యవసాయ పనులు ఈ కాలంలోనే మొదలవుతాయి. అందుకే దీనిని "ఏరువాక కాలం" అని పిలుస్తారు. రైతు జీవితంలో కొత్త పంట సీజన్‌కు ఇదే తొలి అడుగు.

### మృగశిర రోజున చేపల సంప్రదాయం వెనుక రహస్యం..

తెలుగు రాష్ట్రాల్లో మృగశిర కార్తె ప్రారంభమైన రోజున ప్రతి ఇంట్లోనూ చేపల వంటకాలు చేసుకోవడం ఒక బలమైన ఆనవాయితీగా వస్తోంది. దీని వెనుక శాస్త్రీయ, ఆరోగ్య కారణాలు ఉన్నాయి. తీవ్రమైన వేసవి కాలం తర్వాత వాతావరణం ఒక్కసారిగా చల్లబడుతుంది. ఈ మార్పు వల్ల శరీర రోగనిరోధక శక్తి తగ్గే అవకాశం ఉంది. చేపలలో ఉండే ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్లు, ప్రొటీన్లు శరీరానికి అవసరమైన పోషకాలను అందించి రోగాల బారిన పడకుండా కాపాడతాయి. మృగశిర రోజున చేపలు తినడం వల్ల ఆస్తమా, గుండె జబ్బులు, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుందని పెద్దల నమ్మకం.

### చేపమందు ప్రసాదం..

ఈ రోజున తెలుగు రాష్ట్రాల్లో ఆస్తమా బాధితుల కోసం ప్రత్యేకంగా చేపమందు పంపిణీ కార్యక్రమం పెద్ద ఎత్తున జరుగుతుంది. దేశం నలుమూలల నుంచి వేలాది మంది ప్రజలు ఈ ప్రసాదాన్ని స్వీకరిస్తారు. చేపలు తినని వారు ఈ రోజున బెల్లంలో ఇంగువ కలిపి ముద్దగా చేసుకుని తింటారు. వర్షాకాలం ప్రారంభంలో వచ్చే కొన్ని సాధారణ జీర్ణక్రియ సమస్యలు, ఇతర ఆరోగ్య ఇబ్బందులను తగ్గించేందుకు ఈ సాంప్రదాయ మిశ్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతారు.

### ప్రకృతిలో కొత్త అధ్యాయం

మృగశిర కార్తెతో ఎండలతో నిర్జీవంగా కనిపించిన ప్రకృతి మళ్లీ పచ్చదనంతో సజీవంగా మారుతుంది. చెరువులు, కుంటలు నీటితో నిండడం ప్రారంభమవుతుంది. తెలుగు ప్రజల జీవితంలో మృగశిర కార్తె అనేది కేవలం ఒక కాలం కాదు.. అది ప్రకృతి, వ్యవసాయం, సంప్రదాయం మరియు సరికొత్త ఆశల సమాహారం.

# తమిళనాడులో పొలిటికల్ హీట్

- 'టీవీకే' ప్రభుత్వం మూడు నెలలు కూడా ఉండదు..
- స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు
- మా కూటమి మద్దతు వల్లే విజయ్ సీఎం పీఠంపై కూర్చున్నారు
- బీజేపీ పరోక్ష పాలనను అడ్డుకోవడానికే ఈ నిర్ణయం
- ఓటర్లను కలవకపోయినా అదృష్టంతో గెలిచారు
- డీఎంకే అధినేత ఘాటు వ్యాఖ్యలు

**చెన్నై, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త సంచలనం చోటుచేసుకుంది. కొత్తగా ఏర్పడిన నటుడు విజయ్‌కు చెందిన తమిళగ వెట్రి కళగం ప్రభుత్వంపై డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొలువుదీరిన టీవీకే ప్రభుత్వం కనీసం మూడు నెలలైనా అధికారంలో కొనసాగుతుందా అని రాష్ట్ర ప్రజలే చర్చించుకుంటున్నారని ఆయన వ్యాఖ్యానించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడినందున కనీసం ఆరు నెలల వరకు ఎలాంటి విమర్శలు చేయకూడదని తాము భావించామని, కానీ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న దారుణ పరిస్థితుల వల్ల ఆ గడువు కంటే ముందే స్పందించాల్సి వస్తోందని అన్నారు. ప్రజాదరణ లేని ఈ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలబడదంటూ ఆయన జోస్యం చెప్పారు. గత 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచే డీఎంకే క్షేత్రస్థాయిలో 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం పక్కా వ్యూహంతో కసరత్తులు ప్రారంభించిందని స్టాలిన్ గుర్తుచేశారు. బూత్ స్థాయి ఏజెంట్లను నియమించడం, ప్రాంతీయంగా కీలక సమావేశాలు నిర్వహించడం వంటి ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ తాము అధికారంలోకి రాలేకపోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు కనీసం ఓటర్లను కలవకపోయినా, బూత్ ఏజెంట్లను కూడా సరిగ్గా నియమించుకోకపోయినా అదృష్టవశాత్తూ గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని టీవీకే అధినేత విజయ్‌ను ఉద్దేశించి స్టాలిన్ ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాష్ట్రపతి పాలన రాకూడదనే ఏకైక ఉద్దేశంతోనే, తమ కూటమిలోని భాగస్వామ్య పక్షాలు టీవీకే ప్రభుత్వానికి మద్దతు ఇచ్చేందుకు తాము అంగీకరించామని స్టాలిన్ అంతరంగిక నిజాన్ని వెల్లడించారు. "ఒకవేళ తాము ఆ నిర్ణయం తీసుకోకపోయి ఉంటే తమిళనాడులో గవర్నర్ పాలన వచ్చి, కేంద్రంలోని బీజేపీ పరోక్షంగా రాష్ట్రాన్ని ఏలే మార్గం సుగమం అయ్యేది. కేవలం మా కూటమిలోని పార్టీల మద్దతు వల్లే ప్రస్తుత టీవీకే ప్రభుత్వం నడుస్తోందనే విషయాన్ని విజయ్ గుర్తుంచుకోవాలి" అని స్టాలిన్ హెచ్చరించారు. తమిళనాడులో కొత్త ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే స్టాలిన్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇరు పార్టీల మధ్య తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి.

# అధికారుల నిర్లక్ష్యానికి 'ఓపెన్ జిమ్' బలి

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు..
- ఉద్యోగార్థులు, కాలనీవాసుల ఆగ్రహం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నిర్వహణ లోపం, అధికారుల ఘోర నిర్లక్ష్యం కారణంగా అచ్చంపేట పట్టణంలోని ఒక మంచి ప్రాజెక్టు నిరుపయోగంగా మారుతోంది. బస్టాండు సమీపాన గల వాటర్ ట్యాంక్ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు పర్యవేక్షణ లేక తుప్పు పట్టిపోతున్నాయి. ఒకవైపు నిరుద్యోగ యువత శారీరక దేహదారుఢ్యం కోసం, మరోవైపు పట్టణ ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామం చేసుకోవడం కోసం రూ. 10 లక్షల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఈ ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. కానీ, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో ఈ విలువైన పరికరాలన్నీ ప్రస్తుతం వినియోగానికి పనికిరాకుండా పోతున్నాయి. గత ఏడాది ఈ ఓపెన్ జిమ్ ప్రారంభించిన సమయంలో పట్టణ ప్రజలు, ముఖ్యంగా పోలీస్, ఆర్మీ వంటి ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువతీ యువకులు ఎంతో ఆసక్తితో ఇక్కడికి వచ్చి కసరత్తులు చేసేవారు. అయితే కాలక్రమేణా పరికరాలు పాడవుతున్నా అధికారులు పట్టించుకోలేదు. జిమ్‌లో ఏర్పాటు చేసిన రబ్బర్ మ్యాట్లు ఊడిపోయాయి, వ్యాయామ పరికరాలు విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. తప్పనిసరి పరిస్థితుల్లో నిరుపేద, మధ్యతరగతి యువకులు సైతం వేలాది రూపాయలు వెచ్చించి ప్రైవేటు శిక్షణ సంస్థలను (జిమ్‌లను) ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఓపెన్ జిమ్ పరిసరాలు ఇసుక తిన్నెలు, కంకర రాళ్లు, పిచ్చి మొక్కలతో నిండిపోయి అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. కనీసం మున్సిపల్ స్వీపర్ల ద్వారా కూడా ఈ ప్రాంతాన్ని శుభ్రం చేయించడం లేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. "పట్టణ ప్రజల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను మున్సిపల్ అధికారులు గాలికొదిలేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే పరికరాలకు మరమ్మతులు చేయించి, మైదానాన్ని శుభ్రం చేయించాలి. అలాగే ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేసిన మున్సిపల్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని అచ్చంపేట వాసులు డిమాండ్ చేస్తున్నారు.



# వేములవాడలో భక్తుల సందడి

▪ భీమేశ్వరాలయంలో పోటెత్తిన భక్తజనం



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడలో భక్తుల సందడి నెలకొంది. శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వేసవి సెలవులు ముగుస్తుండటం, అందునా చివరి ఆదివారం కావడంతో ఉదయం నుంచే ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించుకుని పునీతులయ్యారు. ఆలయానికి వచ్చిన భక్తులు భీమేశ్వర స్వామివారికి ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కులు చెల్లించుకున్నారు. వీటితో పాటు తలనీలాల సమర్పణ, అభిషేకం, అన్నపూజ, ఆకుల పూజ, నిత్య కళ్యాణం, చండీ హోమం, సత్యనారాయణ వ్రతం, లింగార్చన, కుంకుమ పూజ వంటి పలు విశేష పూజల్లో కుటుంబ సమేతంగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భీమేశ్వర స్వామి ఆలయంతో పాటు అనుబంధ దేవతగా వెలసిన శ్రీ బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయానికి కూడా భక్తులు పోటెత్తారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తాగునీటి సదుపాయం, క్యూ లైన్ల నిర్వహణ, పరిశుభ్రతపై ఆమె ప్రత్యేక శ్రద్ధ వహించారు. స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఏఈవోలు జి. శ్రావణ్ కుమార్, జి. అశోక్ కుమార్ ల పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, భద్రతా సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించారు. నిరంతర పర్యవేక్షణ కారణంగా భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో స్వామివారిని, అమ్మవారిని దర్శించుకోగలిగారు. దేవస్థానం అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషి వల్ల ఏర్పాట్లు విజయవంతమయ్యాయి.

# దళితుల భూముల్లో దౌర్జన్యంగా రోడ్డు నిర్మాణం

## నిందితులపై చర్యలు తీసుకోవాలి



**దుగ్గొండి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తమకు ప్రభుత్వం కేటాయించిన వ్యవసాయ భూముల్లో దౌర్జన్యంగా జేసీబీతో రోడ్డు వేస్తూ, అడ్డుకున్నందుకు కులం పేరుతో బూతులు తిడుతూ బెదిరింపులకు గురిచేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, తమకు రక్షణ కల్పించాలని వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తోకలపల్లి గ్రామానికి చెందిన దళిత బాధితులు ఆదివారం నాడు దుగ్గొండి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం.. తోకలపల్లి శివారులోని కొత్తచెరువు మైదానం వద్ద గల గడ్డ భూమిలో పంటలు వేసుకునేందుకు ప్రభుత్వం తమకు తలా 20 గుంటల చొప్పున నలుగురికి కలిపి మొత్తం 80 గుంటల భూమిని కేటాయించింది. అయితే, అదే గ్రామానికి చెందిన ఉష్ణగిరి భద్రయ్య (తండ్రి రాజేశ్వరరావు) వ్యవసాయ భూమికి వెళ్లేందుకు ఇప్పటికే పైనుంచి బండి బాట ఉన్నప్పటికీ.. దాన్ని వదిలేసి, దౌర్జన్యంగా దళితుల భూముల గుండా రోడ్డు వేసేందుకు జూన్ 5 అర్ధరాత్రి సమయంలో జేసీబీతో తవ్వకాలు ప్రారంభించారు.విషయం తెలుసుకున్న బాధితులు జూన్ 6వ తేదీ ఉదయం 10 గంటల ప్రాంతంలో పొలాల వద్దకు వెళ్లి జేసీబీ పనిని నిలిపివేయించి ఇంటికి తిరిగివచ్చారు. కానీ, అదే రోజు సాయంత్రం 4 గంటలకు ఉష్ణగిరి భద్రయ్య, ఉష్ణగిరి కమలమ్మ (భర్త భద్రయ్య), ఉష్ణగిరి నాగరాజు (తండ్రి భద్రయ్య)లు మళ్లీ జేసీబీతో పనులు రన్ చేయిస్తుండటంతో బాధితులు అక్కడికి చేరుకున్నారు. "మా భూముల్లోంచి రోడ్డు వేయకండి, మా వ్యవసాయ భూములు ఖరాబ్ చేయకండి" అని వేడుకోగా.. సదరు వ్యక్తులు ఆగ్రహంతో ఊగిపోతూ బాధితులను కులం పేరుతో అసభ్య పదజాలంతో దూషిస్తూ, వారిపైకి దౌర్జన్యానికి దిగారు. అయినప్పటికీ బాధితులు ధైర్యం చేసి జేసీబీ డ్రైవర్‌తో మాట్లాడి పనిని బంద్ చేయించారు. ఈ భూ ఆక్రమణ, దౌర్జన్యం వెనుక భజనపల్లి గ్రామానికి చెందిన మోర్తాల చందర్ హస్తం ఉందని, అతని అండదండలతోనే నిందితులు తమపై ఇంతలా రెచ్చిపోతున్నారని బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి సదరు నలుగురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సహా ఇతర చట్టపరమైన సెక్షన్ల కింద కఠిన చర్యలు తీసుకుని, తమ భూములకు, ప్రాణాలకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు. దుగ్గొండి పోలీసులను ఆశ్రయించిన వారిలో దళిత బాధితులు దామెర సదయ్య, దామెర చిన్నబాబు, బుగ్గ సాంబయ్య, బుగ్గ లచ్చయ్య, జన్ను సునీల్, జన్ను చిన్న సదయ్య, నర్మెట్ట సమ్మయ్య, గూడెపు కట్ట స్వామితో పాటు పలువురు గ్రామస్తులు ఉన్నారు. పీఎస్ పరిధిలో ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ ఛాంపియన్షిప్‌లో ఘనత

• ఇద్దరు ఓరుగల్లు విద్యార్థులకు కాంస్య పతకాలు

**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ ఛాంపియన్షిప్‌లో వరంగల్ జిల్లాకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను చాటి ఓరుగల్లు కీర్తిని జాతీయ వేదికపై చాటారు. ఒడిస్సాలోని ఖుర్దాలో మే 30వ తేదీ నుండి జూన్ 3వ తేదీ వరకు హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో వరంగల్ నగరానికి చెందిన 'మణి మార్షల్ ఆర్ట్స్ అండ్ ఫిట్నెస్ అకాడమీ' విద్యార్థులు కార్తీక్ పరిశి, గణేష్ పూసల అద్భుత ప్రదర్శన కనబరిచి కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. జాతీయస్థాయిలో పతకాలు సాధించి తిరిగొచ్చిన యువ క్రీడాకారులు కార్తీక్, గణేష్‌లను ప్రముఖ మార్షల్ ఆర్ట్స కోచ్ గడదాసు మణికంఠ అకాడమీ వేదికగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన గట్టి పోటీదారులను ఎదుర్కొని మన విద్యార్థులు కాంస్య పతకాలు సాధించడం వరంగల్ జిల్లాకే గర్వకారణమని కొనియాడారు. వారి కఠిన శ్రమ, క్రమశిక్షణే ఈ విజయానికి కారణమని ప్రశంసించారు. జాతీయ వేదికపై ఓరుగల్లు క్రీడాకారులు పతకాలతో మెరవడం పట్ల కోచ్ మణికంఠతో పాటు క్రీడాకారుల తల్లిదండ్రులు, స్నేహితులు, స్థానిక క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో వీరు అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించి దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



# కారు – బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

**చెన్నారావుపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వరంగల్ జిల్లా చెన్నారావుపేట – పాపయ్యపేట ప్రధాన రహదారిపై ఆదివారం ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జోజిపేట సమీపంలో వేగంగా వచ్చిన ఒక కారు, ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి రోడ్డుపై పడిపోయి, తలకు మరియు శరీర భాగాలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బాధితుడి వివరాలు సేకరించగా.. ఆయన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగా గ్రామానికి చెందిన బాదావత్ హరి సింగ్ (45)గా స్థానికులు గుర్తించారు. కారు వేగమే ఈ ప్రమాదానికి కారణమని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే 108 అత్యవసర వైద్య సేవల వాహనం హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుంది. 108 ఈఎంటి అనిత బాధితుడికి అక్కడికక్కడే ప్రాథమిక అత్యవసర చికిత్స అందించగా.. పైలట్ వైనాల నాగరాజు వాహనాన్ని వేగంగా నడిపి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితుడిని సమయానికి ఆసుపత్రికి చేర్చిన 108 సిబ్బంది సమయస్ఫూర్తిని స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు. కాగా, ఈ ప్రమాద ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. ప్రమాదానికి కారణమైన కారును, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టారు.

# గట్టు తుమ్మెన్ - తుమ్మన్‌పేట మధ్య రోడ్డు పునరుద్ధరణ

◆ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ గౌడ్

**బల్మూరు, వాయిస్ ఆఫ్ వందే భారత్:** అచ్చంపేట నియోజకవర్గం బల్మూరు మండలం గట్టు తుమ్మెన్ గ్రామపంచాయతీ నుంచి తుమ్మన్‌పేట వరకు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రోడ్డు కష్టాలకు తెరపడింది. స్థానిక ఓబీసీ జిల్లా అధ్యక్షుడు వంగ గిరివర్ధన్ గౌడ్ చొరవతో, అచ్చంపేట ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సహకారంతో నూతనంగా వేసిన మట్టి రోడ్డు పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ రోడ్డు అందుబాటులోకి రావడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలకు ఇన్నాళ్లుగా పడుతున్న ఇబ్బందులు తొలగిపోయి, ప్రయాణం సులువుగా మారింది. రోడ్డు పనులను పర్యవేక్షించి, త్వరితగతిన పూర్తి చేయించినందుకు గాను





తుమ్మన్‌పేట్ సర్పంచ్ పుట్ట సురేష్, గ్రామస్తులతో కలిసి వంగ గిరివర్ధన్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గ్రామ సంక్షేమంపై ఆయన చూపుతున్న శ్రద్ధను కొనియాడుతూ శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. "రెండు గ్రామాల ప్రజలు, రైతులు, ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల సౌకర్యార్థం ఈ రోడ్డును పునరుద్ధరించడం జరిగింది. రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో అవసరమైన నిధులను మంజూరు చేయించి, ఇక్కడ నాణ్యమైన బీటీ రోడ్డు వేయిస్తాం. దీంతో పాటు గట్టు తుమ్మెన్ గ్రామంలోని ప్రతి కాలనీకి డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు, అవసరమైన చోట్ల వీధి దీపాల ఏర్పాటుకు ప్రత్యేక కృషి చేస్తాం." అని ఓబీసీ జిల్లా అధ్యక్షుడు వంగ గిరివర్ధన్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ విగ్రహ దహనం అత్యంత హేయమైన చర్య



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** తెలుగు ప్రజల ఆరాధ్య దైవం, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహాన్ని దహనం చేయడం అత్యంత హేయమైన చర్య అని పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ, సీనియర్ నాయకులు పాపిశెట్టి కృష్ణయ్య తీవ్రంగా ఖండించారు. ఈ ఘాతుకానికి ఒడిగట్టిన నిందితులను ప్రభుత్వం వెంటనే గుర్తించి, కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాలో గుర్తుతెలియని దుండగులు అర్ధరాత్రి వేళ పెట్రోల్ పోసి ఎన్టీఆర్ విగ్రహాన్ని తగలబెట్టడంపై వారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి శాంతిభద్రతల విఘాతక చర్యలు ప్రజాస్వామ్యంలో సహించరానివని పేర్కొన్నారు. “తెలుగు సమాజంలో విప్లవాత్మకమైన రాజకీయ చైతన్యం తీసుకువచ్చిన మహానాయకుడు ఎన్టీఆర్. అణచివేతకు గురైన బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ అధికారంలో సముచిత భాగస్వామ్యం కల్పించిన ఘనత ఆయనదే. గ్రామీణ ప్రాంతాల్లో పటేల్–పట్వారీ వ్యవస్థను రద్దు చేసి, పేద ప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించిన యుగపురుషుడు ఆయన. అలాంటి మహోన్నత నాయకుడి విగ్రహాన్ని ధ్వంసం చేయడం తెలుగు జాతిని అవమానించడమే.” అని వెంకటరమణ, పాపిశెట్టి కృష్ణయ్య అన్నారు. రాజకీయ కక్షలు లేదా వికృత చేష్టలతోనే ఇటువంటి పనులకు పాల్పడుతున్నారని, ఈ ఘటనపై పోలీసులు తక్షణమే స్పందించి లోతైన విచారణ జరపాలని వారు కోరారు. దోషులను కఠినంగా శిక్షించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

# వేములవాడలో ఘనంగా కుంగ్‌ఫూ బెల్ట్ టెస్ట్

- ప్రతిభ చాటిన విద్యార్థులు



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని ఏఆర్ సీఎం కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ టెస్ట్ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది. అకాడమీ మాస్టర్స్ గగ్గురి దివ్య, స్కైలాబ్ పర్యవేక్షణలో జరిగిన ఈ పరీక్షల్లో సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొని, తమ నైపుణ్యాలను ప్రదర్శించి వివిధ కేటగిరీలలో బెల్ట్‌లను కైవసం చేసుకున్నారు. సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నంచాక్స్, కర్రసాము, కత్తిసాము విన్యాసాలు ప్రేక్షకులను, తల్లిదండ్రులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సీనియర్ బ్లాక్ బెల్ట్ విభాగంలో రోషిని, సుదీప్త, మన్విత, నక్షత్ర, రిష్మిక, మధుమిత, శ్రీనిధి, హంసిని, ప్రవీణ్, సృజన్‌లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రతిష్టాత్మక ‘బ్లాక్ బెల్ట్’ సాధించారు. బ్రౌన్ బెల్ట్ విభాగంలో శివరామకృష్ణ తన ప్రతిభతో బ్రౌన్ బెల్ట్ సొంతం చేసుకున్నారు. కలర్ బెల్ట్ విభాగంలో నిహాంత్, శ్రీమహాదేవి, వేదాంషి, లలిన్, నిత్యాంత్, హన్విక, హన్వి, విధాత్రి, చిన్మయ్, ఆదర్శ్, రితిక్, అశ్విక్, శ్రేయనిష్, వర్షిత్, శ్రేయాన్, విశ్వశ్రీ, శౌర్య, హర్షిణి, సాయినిత్య, చక్రిక, బ్రీతిక, నైత్విక్, ఈశ్వర్, ఐశ్వర్యరాయ్, హర్షవర్ధన్, లాక్షిక, దేవిశ్రీ, రిషి, అక్షయ, దీక్షిత, శివతేజ, హన్ను, హనుష, విన్సీ, విక్షిత్ రానా తదితరులు కలర్ బెల్ట్‌లు సాధించిన వారిలో ఉన్నారు. “ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరికీ ఆత్మరక్షణ విద్య ఎంతో అవసరం. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు కుంగ్‌ఫూతో పాటు సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ నేర్పించాం. మార్షల్ ఆర్ట్స్ ద్వారా కేవలం శారీరక దృఢత్వమే కాకుండా.. క్రమశిక్షణ, మానసిక ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. ఇది యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉంచి, ఆరోగ్యకరమైన జీవనశైలికి అలవాటు పడేలా చేస్తుంది.” అని మాస్టర్ దివ్య అన్నారు. వివిధ విభాగాల్లో బెల్ట్‌లు సాధించి అకాడమీ కీర్తిని పెంచిన విద్యార్థులను ఏఆర్ సీఎం అకాడమీ మాస్టర్స్ పిట్టల లత, శ్రావణలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ గోగులోతు ప్రకాష్, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు. వీరంతా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

# ఆర్టీఐ దరఖాస్తులను నిర్లక్ష్యం చేస్తే జరిమానా తప్పదు

- సామాజిక ఉద్యమకారుడు వావిలాల రాజశేఖర్ శర్మ

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** ప్రభుత్వ పాలనలో జవాబుదారీతనాన్ని పెంచేందుకు సమాచార హక్కు చట్టం–2005 లోని ‘సెక్షన్ 20’ ఒక శక్తివంతమైన ఆయుధంగా పనిచేస్తోందని స్థానిక సామాజిక ఉద్యమకారుడు వావిలాల రాజశేఖర్ శర్మ పేర్కొన్నారు. ప్రజలు సమర్పించే ఆర్టీఐ దరఖాస్తులకు అధికారులు నిర్దేశిత సమయంలో స్పందించకపోతే లేదా తప్పుడు సమాచారం ఇస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. చట్టం ప్రకారం సరైన కారణం లేకుండా సమాచారం ఇవ్వడంలో ఆలస్యం చేసినా, అసంపూర్ణ లేదా తప్పుదారి పట్టించే సమాచారం ఇచ్చినా సంబంధిత ప్రజా సమాచార అధికారులపై సమాచార కమిషన్ కఠినమైన చర్యలు తీసుకుంటుందని రాజశేఖర్ శర్మ వివరించారు. నిబంధనలు ఉల్లంఘించిన అధికారులకు రోజుకు రూ.250 చొప్పున, గరిష్ఠంగా రూ.25,000 వరకు జరిమానా విధించే అధికారం కమిషనర్‌కు ఉంటుందని తెలిపారు. అలాగే దరఖాస్తులను స్వీకరించడానికి నిరాకరించడం, సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగా దాచడం వంటి చర్యలపై కూడా శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేయవచ్చని పేర్కొన్నారు. “సెక్షన్ 20 అమలు వల్ల గ్రామ పంచాయతీల నుంచి కేంద్ర ప్రభుత్వ శాఖల వరకు పారదర్శకత కొంతవరకు పెరిగింది. అధికారుల్లో జవాబుదారీతనం వచ్చినప్పటికీ, ఇప్పటికీ కొన్ని ప్రభుత్వ శాఖల్లో ఆర్టీఐ దరఖాస్తులను నిర్లక్ష్యం చేయడం, అసంపూర్ణ సమాచారంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం వంటి ఆరోపణలు వస్తున్నాయి. సమాచారం ఇవ్వకుండా దాటవేసే అధికారులపై సమాచార కమిషన్లు మరింత కఠినంగా వ్యవహరించాలి.” అని సామాజిక ఉద్యమకారుడు వావిలాల రాజశేఖర్ శర్మ అన్నారు. ప్రజాస్వామ్యానికి బలమైన ఆయుధం సమాచార హక్కు చట్టం అనేది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ఒక బలమైన ఆయుధమని శర్మ అభిప్రాయపడ్డారు. అధికారులు చట్టాన్ని గౌరవించి పౌరులకు పూర్తి సమాచారాన్ని సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. సమాజంలో ప్రతి పౌరుడు ఆర్టీఐ చట్టంపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని, తమ హక్కులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



# 8న మృగశిర కార్తె

- నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ‘చేప ప్రసాదం’
- ప్రభుత్వం తరఫున భారీ ఏర్పాట్లు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రాధాన్యత కలిగిన మృగశిర కార్తెను పురస్కరించుకుని.. శ్వాసకోశ, ఉబ్బసం వ్యాధిగ్రస్తుల కోసం బత్తిని హరినాథ్ గౌడ్ కుటుంబం ఏటా అందించే ప్రసిద్ధ ‘చేప మందు’ పంపిణీకి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ సర్వసిద్ధమైంది. రేపు రాత్రి 9:00 గంటలకు ప్రారంభం కానున్న ఈ పంపిణీ కార్యక్రమం, మరుసటి రోజు జూన్ 9 రాత్రి వరకు.. దాదాపు 24 గంటల పాటు నిరంతరాయంగా కొనసాగనుంది. బత్తిని గౌడ్ కుటుంబం గత 176 సంవత్సరాలుగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా, ఉచితంగా ఈ సాంప్రదాయాన్ని కొనసాగిస్తోంది. ఉబ్బసం మరియు శ్వాసకోశ సమస్యలతో బాధపడే వారికి బతికున్న కొర్రమీను చేప పిల్ల నోట్లో ప్రత్యేక పసుపు మూలికల పేస్ట్‌ను ఉంచి నోటి ద్వారా మింగిస్తారు. కాగా, శాఖాహారుల కోసం ప్రత్యేకంగా బెల్లంతో తయారు చేసిన ప్రసాదాన్ని బత్తిని కుటుంబ సభ్యులు అందజేయనున్నారు. దేశం నలుమూలల నుండి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున తెలంగాణ ప్రభుత్వం మరియు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. మత్స్య శాఖ ద్వారా ఇప్పటికే 1.4 లక్షల కొర్రమీను చేప పిల్లలను నాంపల్లి మైదానంలో సిద్ధంగా ఉంచారు. రవాణా, ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌ను సందర్శించి, క్యూ లైన్లు, తాగునీటి సౌకర్యం, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

# 22 నుంచి మళ్లీ ‘హైడ్రా ప్రజావాణి’

## ఈ నెల 8, 15 తేదీల్లో కార్యక్రమాలు రద్దు




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** హైదరాబాద్ నగర ప్రజలకు అలర్ట్. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించే ‘హైడ్రా ప్రజావాణి’ కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా పడింది. ఈ నెల 8, 15వ తేదీల్లో జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. తిరిగి ఈ నెల 22 నుంచి ప్రజావాణి యథావిధిగా ప్రారంభం కానుంది.

# వీచిన భారీ గాలి దుమారం

- రహదారిపై కూలిన చెట్లు
- గంటల్లోనే తొలగించిన రూరల్ ఎస్సై వెంకట్రాజం..
- వేములవాడ పోలీసుల సమయస్ఫూర్తి

**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వేములవాడ రూరల్ మండలంలో ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా వీచిన భారీ గాలి దుమారం, ఈదురు గాలులు జనజీవనాన్ని, రవాణా వ్యవస్థను అస్తవ్యస్తం చేశాయి. గాలుల తాకిడికి నాగయ్యపల్లె నుంచి మర్రిపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద చెట్లు విరిగిపడ్డాయి. దీంతో ఇరువైపులా వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డుపై చెట్లు కూలి రవాణా నిలిచిపోయిన సమాచారం అందిన వెంటనే వేములవాడ రూరల్ ఎస్సై వెంకట్రాజం అప్రమత్తమయ్యారు. ఆయన తన సిబ్బందితో కలిసి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితి తీవ్రతను గమనించి వెంటనే జేసీబీ యంత్రాన్ని రప్పించారు. యుద్ధప్రాతిపదికన



రహదారికి అడ్డంగా పడిన భారీ వృక్షాలను, కొమ్మలను తొలగించి ట్రాఫిక్ అంతరాయాన్ని క్లియర్ చేశారు. ఎస్సై వెంకట్రాజం నేతృత్వంలోని పోలీస్ బృందం వేగంగా స్పందించడంతో కేవలం గంటల వ్యవధిలోనే నాగయ్యపల్లె రహదారిపై వాహనాల రాకపోకలు యథావిధిగా పునరుద్ధరించబడ్డాయి. అత్యవసర సమయంలో ప్రయాణికుల ఇబ్బందులను గమనించి, సమయస్ఫూర్తితో అండగా నిలిచిన రూరల్ పోలీసుల చొరవపై స్థానిక ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రశంసలు కురిపించారు.